Title Code: TELTEL 02105

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జులు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

Malkajgiri | Volume: 2 Issue: 213 | Sunday, November 10, 2024 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 2 సంచిక : 213 | ఆదివారం, నవంబర్ 10, 2024 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

### పాకిస్థాన్‌లోని క్వెట్టా రైల్వే స్టేషన్‌లో....

## భారీ పేలుడు



**బలూచిస్తాన్:** పాకిస్తాన్ మరోసారి బాంబు పేలుడుతో దద్దరిల్లింది. బలూచిస్తాన్‌లోని క్వెట్టా రైల్వే స్టేషన్‌లో శనివారం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో దాదాపు 24 మంది మరణించగా.. మరో 40 మందికి పైగా గాయపడినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ప్లాట్‌ఫాం నుంచి పెషావర్ కు రైలు వెళ్లున్న సమయంలో పేలుడు జరిగినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్వెట్టా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మహ్మద్ బలోచ్ మాట్లాడుత. ఈ సంఘటన "ఆత్మహుతి బాంబు పేలుడు"గా అని అనిపిస్తుందని చెప్పారు. అయితే ఇది ఖచ్చితంగా చెప్పడానికి అప్పుడే నిర్ధారణకు రాలేమని, ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని అన్నారు.

### కాంగ్రెస్ రాష్ట్రాలు గాంధీ కుటుంబానికి...

## ఏటీఎంలు



**అకోలా :** ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా ఆ రాష్ట్రం పార్టీ 'షాహీ పరివార్'కు ఏటీఎంగా మారుతుంటుందని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఆరోపించారు. ఈ నెల 20 నాటి మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి అకోలాలో ఒక ప్రచారం ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఏటీఎం కానివ్వబోమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అంత ఎక్కువగా అవినీతికి పాల్పడుతు న్నప్పుడు అధికారంలో ఉంటే ఆ పార్టీ ఎంత అవినీతిమయంగా ఉంటుందో ఎవరైనా ఊహించుకోవచ్చునని ప్రధాని అన్నారు. 'కాంగ్రెస్ ఎక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసినా ఆ రాష్ట్రం పార్టీ షాహి పరివార్‌కు ఏటిఎంగా మారిపోతుంది. మహారాష్ట్ర ఎన్నికల కోసం (కాంగ్రెస్ పాలిత) కర్నాటకలోని మద్యం వ్యాపారుల నుంచి రూ. 700 కోట్లు బలవంతంగా వసూలు చేశారు. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ కూడా ఆ షాహీ పరివార్ ఏటీఎంలుగా మారాయి' అని మోడీ ఆరోపించారు. (మహారాష్ట్రలోని అధికార కూటమి) మహాయుతి మహిళల భద్రత, ఉద్యోగావకాశాలు, లడ్కీ బహిన్ యోజన విస్తరణపై దృష్టి కేంద్రీకరిస్తుండగా, కాంగ్రెస్, శివసేన (యుబిటి), శరద్ పవార్‌కు చెందిన ఎన్‌సిపి (ఎస్‌పి)తో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) 'అవినీతి పత్రం'తో వచ్చిందని ఆయన పేర్కొన్నారు. 'ఎంవిఎ అంటే అవినీతి, టోకెన్ డబ్బు, బదలీ నియామక వ్యాపారం అనేదని మొత్తం దేశానికి తెలుసు' అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌ను ప్రధాని మరింతగా తూర్పారపడుతూ, పార్టీ షాహీ పరివార్ ఎన్నడైనా బాబాసాహెబ్ అంబేద్కర్ 'పంచ్‌తీర్థ్'ను సందర్శించారా అని తాను సవాల్ చేస్తున్నానని చెప్పారు.

### 14వ తేది నుంచి...

## ప్రజా విజయోత్సవాలు



**హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తి అవుతున్నందున ఈ నెల 14 వ తేదీ నుండి డిసెంబర్ 9 వ తేదీ వరకు 26 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా విజయోత్సవాలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. ఈ ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన నేడు సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల, ప్రజాకవి జయరాజ్, వివిధ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో దేశంలోని మరే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేని ఎన్నో విప్లవాత్మక, ఊహకు అందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమాలను షో కేస్ చేస్తూ, ప్రభుత్వ విజన్ ను తెలియచేసేవిధంగా ఈ కార్యక్రమాలను రూపొందిస్తున్నా మని వివరించారు.

ఈ 26 రోజుల కార్యక్రమాల్లో ప్రభుత్వ గ్యారెంటీ పథకాలైన మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విధ్యుత్, రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఇందిరా మహిళా శక్తి తదితర పథకాలతోపాటు, ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చైతన్య పరుస్తామని తెలిపారు. ఇప్పటికే 50 వేల ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందని, దాదాపు రూ. 18 వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాల మాఫీ చేయడంతోపాటు మహిళా సంఘాలకు 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందచేశామని గుర్తు చేశారు. మూతపడిన కమలాపూర్ రేయన్స్ పరిశ్రమను 4వేల కోట్లతో పునరుద్ధరించబోతున్నామని తెలిపారు.

### అవినీతిపరులను తలకిందులుగా...

## వేలాడదీస్తాం

**పాలము (జార్ఖండ్):** అవినీతిపరులను తలకిందులుగా వేలాడదీస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జార్ఖండ్ లోని పాలము ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జార్ఖండ్ ముక్తి మోర్చా సంకీర్ణ ప్రభుత్వం దేశం లోనే అత్యంత అవినీతిమయ సర్కారుగా మారిందని, ఇకనైనా ప్రజలు వారిని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చొరబాటులను అరికట్టడం కేవలం మోడీ నాయకత్వం లోని బీజేపీ వల్లనే సాధ్యమవు తుందన్నారు. ఓబీసీ కోటాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ మహారాష్ట్ర లోని కొన్ని వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, అయితే మత ప్రాదికన రిజర్వేషన్లనకు బీజేపీ వ్యతిరేకం అనే విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గుర్తుంచుకోవాలని అమిత్‌షా అన్నారు. రాహుల్‌గాంధీ తన వెంట ఎప్పుడూ రాజ్యాంగాన్ని తీసుకెళ్లి , ప్రచారాల్లో దాన్ని చూపిస్తుండటాన్ని ప్రస్తావిస్తూ , కాంగ్రెస్ నేత నకిలీ రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ దానిని అపహాస్యం చేస్తున్నారని అమిత్‌షా దుయ్యబట్టారు. జమ్ము కశ్మీర్ ఎన్నటికీ భారత్‌లో అంతర్భాగమేనని, ఎన్ని తరాలు వచ్చి అడిగినా , ఆర్టికల్ 370 (ఆర్టికల్ 370)ని పునరుద్ధరించే అవకాశం లేదని షా పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో



పెరుగుతున్న అక్రమ చొరబాటుదారుల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అది తమ పొలిటికల్ అజెండా అని సిఎం హేమంత్ సోరెన్ విమర్శిస్తున్నారని అన్నారు. సోరెన్ వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని దుయ్యబట్టారు.

## భారత్‌లో పన్ను వ్యవస్థ నిరుపేదల దోపిడీకే : రాహుల్ గాంధీ



**ధన్‌బాద్ (జార్ఖండ్):** లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. కేంద్రం పన్నుల వ్యవస్థ 'నిరుపేదలను దోచుకునేందుకు' ఉద్దేశించినది అని రాహుల్ విమర్శించారు. జార్ఖండ్ ధన్‌బాద్‌లో ఒక ర్యాలీలో రాహుల్ ప్రసంగిస్తూ, 'భారతీయ పన్నుల వ్యవస్థ నిరుపేదలను దోచుకునేందుకే. అదానీ మీతో సమానంగా పన్నులు చెల్లిస్తుంటారు. ఒక లక్ష కోట్ల రూపాయలు విలువ చేసే ధారవి భూములను ఆయనకు దత్తం చేస్తున్నారు' అని ఆరోపించారు. రాహుల్ ప్రధాని నరేంద్ర మోడీని కూడా తూర్పారపట్టారు. 'ప్రధాని మోడీ సీప్లేన్లలో ప్రయాణిస్తుంటారు, సముద్రం లోపలికి వెళుతుంటారు, కానీ నిరుపేదలు, మహిళలు ధరల పెరుగుదల భారాన్ని భరిస్తుంటారు' అని ఆయన విమర్శించారు. షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టిలు), షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సిలు), ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసిలు) దేశ జనాభాలో 90 శాతం ఉంటారని, కానీ వారికి ప్రభుత్వ సంస్థల్లో ప్రాతినిధ్యం లేదని కూడా ఆయన ఆరోపించారు. 'ప్రధాని మోడీ పెట్టుబడిదారులకు మాఫీ చేసిన రుణాలకు సమాన మొత్తంలో నిధులను నిరుపేదలకు మేము అందజేస్తాం' అని రాహుల్ హామీ ఇచ్చారు.

### కుటుంబ సర్వేను...

## సమర్ధవంతంగా నిర్వహించండి

**హైదరాబాద్ :** హౌస్ లిస్టింగ్ పూర్తిచేసుకుని నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో కలెక్టర్లు ఏనుమరెటర్లతో విస్తృతంగా మాట్లాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి అనేక సందేహాలు వ్యక్తమవుతుంటాయని,, కలెక్టర్లు ఎనుమరెటర్ ల తో ఎప్పటికప్పుడు మాట్లాడితే ప్రజల సందేహాలు ఏంటో వెను వెంటనే తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల సందేహాలను కలెక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి ప్రజల అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఆదేశించారు.



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### ధాన్యం కొనుగోళ్లలో...

### : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

## రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**భువనగిరి :** ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కేంద్రాల్లోనే 25 రోజులుగా ఉంటే, మొలకలొస్తుంటే రేవంత్ సర్కారుకు ఏ మాత్రం సిగ్గనిపిస్తలేదా అని మండిపడ్డారు. యాదాద్రి జిల్లా పోచంపల్లి మండల కేంద్రంతోపాటు రేవన్నపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రాలను కిషన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 20 రోజులైనా కాంగ్రెస్ సర్కారు ధాన్యం కొంటలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్‌కు ఆయన ఫోన్ చేశారు. అయితే స్విచ్ ఆఫ్ రావడంతో అడిషనల్ కలెక్టర్‌తో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించకపోవడంపై ఆగ్రహం 'ట్రాన్స్ పోర్టు, బస్తాలు, బస్తా సుతిల్, హమాలి చార్జీలు ఇలా మొత్తం కేంద్రమే రాష్ట్రానికి చెల్లిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. రాష్ట్ర సర్కారు కొనుగోళ్ల కోసం ఒకవేళ బ్యాంకు నుంచి అప్పు తీసుకుంటే దాని వడ్డీ కూడా కేంద్రమే చెల్లిస్తుందని చెప్పారు. రైతుల ధాన్యం కొనడంలో రాష్ట్ర సర్కారుకు వచ్చిన ఇబ్బంది ఏంటి?' అని నిలదీశారు. స్థానిక అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.



# తెలంగాణ షాన్

## సంపాదకీయం

### బడుగుల ఆశా దీపం

భారత దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనే సదుద్ధేశంతో కేంద్ర ప్రభుత్వం చేసిన లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆక్ట్ 1987 తీసుకురావడం జరిగింది. ఈ చట్టం 09 నవంబర్ 1995 నుంచి అమలులోకి రావడంతో ఆ రోజు ప్రత్యేకతను గుర్తించిన ప్రభుత్వం ప్రతి ఏట 09 నవంబర్‌న "జాతీయ న్యాయ సేవల దినం లేదా నేషనల్ లీగల్ సర్వీసెస్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ఈ చట్టం ద్వారా జాతీయ స్థాయిలో "నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ లేదా జాతీయ న్యాయ సేవల అథారిటీ, రాష్ట్ర స్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నాయకత్వంలో "రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ(స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ)", జిల్లా స్థాయిలో "జిల్లా న్యాయ సేవల అథారిటీ(డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ)" ఆయా ప్రాంతాల బడుగు బలహీన వర్గాలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తూనే అవగాహన కార్యక్రమాలను నిర్వహించుట జరుగుతున్నది.

న్యాయ దేవత, చట్టం ముందు అందరూ సమానమే. ఉన్న వారికి ఒక న్యాయం, లేని వారికి మరో న్యాయం అందుకున్న అకాలమిది. చేసే వారికి తగు శిక్షలు తక్షణమే పడాలి. న్యాయం కావాలని కోర్టులో కేసులు పట్టడం చాలా ఖర్చుతో కూడుకున్న అంశం అని మనందరికీ తెలుసు. న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కలేదని నిరుపేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయం అందించడం, న్యాయ సంబంధ అవగాహనలు నిర్వహించడం, మైనారిటీ/ఎస్సి/ఎస్టీ/మహిళలు/పిల్లలు/మానవ అక్రమ రవాణా విషవలలో చిక్కిన వారికి ఉచితంగా న్యాయ సేవలు లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా అందించడం జరుగుతోంది. న్యాయ హక్కుల పట్ల సరైన అవగాహన లేని సమాజంలో మనం ఉన్నాం. పేదలకు సహితం న్యాయమైన హక్కులు అనుభవించే అవకాశం ఇవ్వడమే న్యాయ సేవల అథారిటీ లక్ష్యంగా తీసుకోబడింది. క్షేత్ర స్థాయిలో లోక్ అదాలత్‌లను నిర్వహిస్తూ, సమస్యలకు పరిష్కారాలు అక్కడికక్కడే అందించే ప్రయత్నాలు ఈ అథారిటీల ద్వారా జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా సుప్రీమ్ కోర్టు స్థాయిలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైకోర్టుల పరిధిలో 39 హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 37 స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 673 డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 2465 తాలూకా స్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీలు ఉచిత న్యాయ సేవలను బలహీన వర్గాలకు అందిస్తున్నాయి. లీగల్ సర్వీసెస్ అథారిటీల ద్వారా ఉచిత న్యాయ సేవలు, లీగల్ రైట్స్ పట్ల అవగాహనలు, న్యాయన్ని వేగంగా అందించడం, పేదలకు న్యాయ సేవలు అందుబాటులోకి రావడం, కోర్టు మెట్లు ఎక్కకుండానే న్యాయం పొందగలగడం, లోక్ అదాలత్‌లను నిర్వహించి సత్వరమే కేసులను పరిష్కరించడం లాంటి మహత్తర కార్యాలను న్యాయ సేవల అథారిటీలు నిర్వహిస్తున్నాయి.అందరికీ సరైన న్యాయం సమానంగా అందాలి. ఆర్థికంగా చితికిన బడుగుల చెంతకు న్యాయ సేవలు ఉచితంగా అందించబడాలి. చట్టం ముందు తరతమ భేదాలు ఉండకూడదు. కోర్టుల్లోకి చేరి దశాబ్దాలుగా కోర్టుల్లో కేసులు పొడిగించబడి కుటుంబాలు చితికి పోకూడదు. న్యాయం అందడానికి సమయం పట్టకూడదు. ఆలస్యంగా న్యాయం అందినా అది అన్యాయమే అవుతుందని గమనించి ఉచిత న్యాయ సేవలు అందిస్తున్న లీగల్ సర్వీసెస్ అథారిటీలను ఆశ్రయించి సత్వర న్యాయం పొందాలని ఆశిద్దాం, కోర్టు మెట్లెక్కని రోజులు రావాలని కోరుకుందాం.

## ఇండియన్ నేవీకి ఎంపికైన కుత్బుల్లాపూర్ నివాసిని అభినందించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్:** ఇండియన్ నేవీలో (ఎస్ఎస్ఆర్) లో ఉద్యోగం సాధించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 128 - చింతల్ డివిజన్ కు చెందిన మేకల మనోహర్ కుమార్తె మేకల ప్రిస్పిల్లా వెస్లీ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ నేవీలో ఉద్యోగం సంపాదించిన మేకల ప్రిస్మిల్లా వెస్లీని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... కృషి, పట్టుదలతో జీవితంలో సాధించలేనిది ఏమీ లేదని, బలహీనతలను అధిగమించినప్పుడు ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేగల రాము, రాచకొండ మురళి, ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలి: కీలుకానీ లక్ష్మణ్







**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజు గౌడ్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సిపిఎం మూడవ మహాసభలను డిసెంబర్ 7, 8 రోజులలో జయప్రదం చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ షాపూర్ నగర్ లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ విరాళాల సేకరణ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే పార్టీ జిల్లా మహాసభలకు హార్థిక సహకారం అందించి జయప్రదం చేయాలని జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రతినిధులు ఆహ్వానితులు, పరిశీలకులు రాష్ట్ర నాయకుల తో కలిపి 350 వరకు పాల్గొంటారని పార్టీ మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని రానున్న కాలంలో పార్టీ నిర్వహించాల్సిన కార్యక్రమాలను రూపొందించుకొనుటకు ఈ మహాసభలు జరుగుతున్నాయని గతంలో జిల్లావ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని రేషన్ కార్డులు పెన్షన్లు మంజూరు చేయాలని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లాలో ఉన్న పారిశ్రామిక కేంద్రాల్లో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించి సంక్షేమ బోర్డు ద్వారా పెన్షన్లు , స్కాలర్షిప్లు, ఉచిత వైద్యం అందించాలని ఆందోళనలు పోరాటాలు నిర్వహించడం జరిగిందని రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న అంగన్వాడి ఆశ మధ్యాహ్నం భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలని కనీస వేతనం అమలు చేయాలని పోరాటాలు నిర్వహించడం జరిగిందని సమస్యల పరిష్కారం కొరకై పోరాడే భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, ఈ, దేవదానం, రావుల స్వాతి పార్టీ కార్యకర్తలు దుర్గా నాయక్, యాదవరెడ్డి ప్రవీణ్, సద్దాం, చాంద్ పాష, శేఖర్ గౌడ్, అలీ భాయ్, ఆది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్





**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లా మారిందని, ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్ వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన డిపి కాలానికి చెందిన విజయ లక్ష్మి కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 60000/- చెక్కును సదరు మహిళకి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తన నివాసంలో అందించారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించిన గౌరవ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కి భాదిత మహిళ కృతజ్ఞతలు తెలిపారు.

## నల్ల పోచమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్







**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజ్ గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 - జగద్గిరిగుట్ట డివిజన్ షిరిడి హిల్స్ లో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నల్ల పోచమ్మ తల్లి దయతో ప్రజలంతా సుభిక్షంగా, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ జగద్గిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు అడ్వకేట్ కమలాకర్, మక్సుద్ భాయ్, మెట్ల శ్రీను, ఎర్ర లక్ష్మయ్య, వెంకటేష్, ఎర్వ సాయి కిరణ్, దేవాలయం చైర్మన్ సురేందర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు బండ మహేందర్, సాయి, మహేష్, నరేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఒగ్గు కళా స్వర్గీయ చుక్క సత్తయ్య కి నివాళులు

**కాప్రా నవంబర్ 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జి. ఆంజనేయులు:** జనగామ జిల్లాలోని బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత చుక్క సత్తయ్య మనవడు ఒగ్గు రవి ఆహ్వానం మేరకు మాణిక్యపురంలో చుక్క సత్తయ్య విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరైన చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్. ఈ కార్యక్రమంలో ఒగ్గు కళాకారుడు కడకంచి పాపయ్య, అంజయ్య, ధర్మయ్య, శ్రీశైలం, మాజీ కొమురవెల్లి చైర్మన్ సంపత్ కుమార్, పృథ్వి, ఉపాసన పర్వతాలు, సత్యనారాయణ, శేఖర్, కృష్ణ, మల్లేష్, భూమన్న, షేక్, కుల సంఘ పెద్దలు ఒగ్గు కళాకారులు మహిళా ఒక కళాకారులు గ్రామస్తులు జనగామ జిల్లా రాజకీయ నాయకులు వివిధ జిల్లాల నుంచి వచ్చిన సంఘ అధ్యక్షులు కళాకారులు పాల్గొన్నారు.



## ఆదిశైవ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్"ను ప్రారంభించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజ్ గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి సారెగూడెంలో నూతనంగా నిర్మించిన "ఆదిశైవ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్" ను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, డివిజన్ అధ్యక్షులు శంభిపూర్ సుదర్శన్, నాయకులు కె. శ్రీశైలం, శ్రీను, బాల్ రాజ్, నాగార్జున, భాస్కర్, కార్యవర్గం సభ్యులు శేషయ్య, కామేశ్వర్ రావు, మారుతి, నాగేశ్వర్ రావు, కెబిఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్తిక దర్శని బస్సును ప్రారంభించిన డిపో మేనేజర్ మహేష్ కుమార్



**తెలంగాణ షాన్, నవంబర్ 09:** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కుషాయిగూడ డిపో ఈసీఐఎల్ బస్టాండ్ నుండి రెండు కార్తిక దర్శన బస్సులను ఉదయం ప్రారంభించడం జరిగింది. డిపో మేనేజర్ మాట్లాడుతూ కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కార్తీక మాసాలలో దర్శించుకోవడం మంచిదని అన్నారు. ఈసీఐఎల్ బస్టాండ్ నుండి ప్రారంభమై చీరాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అలియాబాద్ లోని రత్నాలయం, మేడ్చల్ లోని బద్రీనాథ్, వర్గంలోని సరస్వతి దేవి,కొమరవెల్లి మల్లన్న కొండపోచమ్మ, కీసరగుట్ట శివాలయం దర్శించుకుని ఈసీఐఎల్ బస్టాండ్ చేరుకుంటు ఈ అవకాశాన్ని కుషాయిగూడ, మౌలాలి హౌసింగ్ బోర్డ్, నేరేడుమెట్, బాలాజీ నగర్, నాగారం, ప్రాంతాల్లో ఉండే భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోగలరని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్ రావు, వెల్ఫేర్ మెంబర్ నర్సింగ్ రావు, కండక్టర్ శ్రావణ్ గౌడ్ ఉద్యోగులు పాల్గొన్నారు

## తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**కాప్రా నవంబర్ 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జి. ఆంజనేయులు:** తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం లో భాగంగా డా ఏ ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని అయోధ్య నగర్ కాలనీ లో ఇంటి ఇంటికి తిరుగుతూ పార్టీ సభ్యత్వం చేసుకొంటే కలిగే సౌకర్యాలు వివరిస్తూ 30మంది కి సభ్యత్వం ఇవ్వటం జరిగింది ఈ కార్యక్రమం లో తెలంగాణా తెలుగు దేశం పార్టీ మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు, గోబిరు రమేష్ కృష్ణారావు, శ్రీనివాసరావు.డి, శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

# రోడ్లపైనే వడ్లు...ప్రాణాలు తీస్తున్న కుప్పలు



**మెదక్ :** వాహనాలు తిరిగే రోడ్లపై వడ్లు ఆరబోయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం వద్ద ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడానికి రోడ్డు పై వడ్ల కుప్పలే కారణమయ్యాయి. ఈ ఒక్క సంఘటనే కాదు ప్రతి ఏటా వానకాలం, యాసంగి పంట కోత సీజన్ లో ఇదే సమస్య ఎదురవుతోంది. గడిచిన మూడేళ్లలో ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రోడ్లపై వడ్ల కుప్పల కారణంగా ప్రమాదాలు జరిగి పది మందికి పైగా చనిపోయారు.పెద్ద సంఖ్యలో గాయపడ్డారు.. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధాన రహదారులతో పాటు పలు ఇతర రహదారుల పై కూడా పెద్ద ఎత్తున్న వడ్లను అరబోస్తున్నారు రైతులు. దీంతో చాలా చోట్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరో వైపు కొనుగోలు కేంద్రాల వద్ద స్థలం లేకపోవడం వల్ల రైతులు రోడ్లపై వడ్లు ఆరబోస్తున్నమని అంటున్నారు. రోడ్లపై పెద్ద ఎత్తున్న వడ్ల కుప్పలు ఉండడం వల్ల వీటిని గమనించక వేగంగా వెళ్తున్న వాహనాలు ప్రమాదాలకు గురి అవుతున్నాయి. వడ్లను అరబెట్టడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులతో పాటు, నేషనల్ హైవేలపై సైతం రైతులు వడ్లు ఆరబోస్తున్నారు. నర్సాపూర్ ఉంచి తూప్రాన్ వెళ్లే దారిలో.. మెదక్ పాపన్నపేట, పెద్దశంకరంపేట రూట్‌లో, కొల్చారం వెల్దుర్తి, రంగంపేట– జోగిపేట, చేగుంట బోనాల రూట్లతో పాటు 44 నెంబర్ నేషనల్ హైవే పై, మెదక్ ? హైదరాబాద్ నేషనల్ హైవేపై కిలోమీటర్ల పొడుగునా వడ్లు ఆరబోస్తున్నారు. రాత్రి పూట వడ్లను కుప్ప చేసి వర్షానికి తడవకుండా టాపర్లుకప్పి, గాలికి ఎగిరి పోకుండా బండరాళ్లు పెడుతున్నారు. రోడ్డు సగం వరకు ఆక్రమించి వడ్లు ఆరబోస్తుండగా రాత్రి వేళ కుప్పలు, బండరాళ్లు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో పాటు, ప్రమాదాలు జరుగుతున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లపై సగం వరకు వడ్ల కుప్పలు ఉండడంతో ఒకే వైపు నుంచి వాహనాల రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇది ప్రమాదాలకు దారి తీస్తోంది. గత వారం, పది రోజులుగా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. కానీ ధాన్యం కాంటా పెట్టడం లేదు. ఈ కారణంగా పెద్ద మొత్తంలో ధాన్యం పేరుకుపోతోంది. కేంద్రాల వద్ద స్థలం సరిపోక చాలా మంది రైతులు వడ్లను రోడ్లపై ఆరబోస్తున్నారు.కాగా వడ్లు కొనుగోలు స్పీడ్ గా జరగడం లేదని, మరో వైపు వడ్లు అరబోయడానికి తమకు స్థలం లేదని, అందుకే ఇలా తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా రోడ్ల పై వడ్లను అరబోసుకుంటున్నామని అంటున్నారు రైతులు. ఇలా రోడ్డు పై వడ్లు పోసి వాటి వల్ల రోడ్డు ప్రమాదాలు జరగకుండా కూలీలను సైతం ఏర్పాటు చేస్తున్నాం అని, వారికి రోజుకు వెయ్యి రూపాయలు ఇస్తున్నామని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తే మాకు ఇబ్బందులు ఉండవు అని అంటున్నారు రైతులు.

# కేశవాపురం రిజర్వాయర్ టెండర్లు రద్దు

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో.. హైదరాబాద్‌కు తాగునీటిని సరఫరా చేసేందుకు గానూ గోదావరి ఫేజ్–2 పథకం కింద తలపెట్టిన కేశవపురం రిజర్వాయర్ కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సర్కార్ రద్దు చేసింది. గోదావరి జలాలను కొండపోచమ్మసాగర్ నుంచి కేశవాపురం రిజర్వాయర్‌కు తీసుకొచ్చి.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం బీఆర్ఎస్ సర్కార్ చేపట్టిన ఈ ప్రాజెక్టును ప్రభుత్వం విరమించుకుంది. ఈ ప్రాజెక్టు కోసం మేఘా ఇంజినీరింగ్ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టును రద్దు చేస్తూ ప్రభుత్వం నవంబర్ 05 తేదీన ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ కాంట్రాక్టును రద్దు చేయడంతో పాటు మూసీ పునరుజ్జీవంలో భాగంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు గోదావరి జలాలను మళ్లించే ప్రాజెక్టుకు టెండర్ పిలిచేందుకు హైదరాబాద్ జలమండలికి అనుమతిని కూడా ఇచ్చింది.వాస్తవానికి కొండపోచమ్మ సాగర్ నుంచి కేశవపురం రిజర్వాయర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తాగు నీటిని తీసుకురావావని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే.. సుమారు 2050 వరకు హైదరాబాద్ నీటి అవసరాలను తీర్చగలదని గత ప్రభుత్వం అంచనావేసింది. అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్.. మాత్రం ఈ కాంట్రాక్టును రద్దు చేసింది. ఈ కేశవపురం ప్రాజెక్టు వల్ల ప్రభుత్వంపై అధిక భారం పడనుందని భావించగా.. దీనికంటే తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయాన్ని అనుసరించాలని నిర్ణయించుకుందిఈ కాంట్రాక్టును రద్దు చేయడం వల్ల హైదరాబాద్‌లోని నీటి అవసరాల కోసం గోదావరి ఫేజ్–2 పథకాన్ని మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌ల వరకు పొడిగించడానికి ఖర్చు చేసే నిధుల్లో సుమారు రూ. 2,000 కోట్లు ఆదా అవుతాయని రేవంత్ రెడ్డి సర్కార్ అంచనా వేస్తోంది. సవరించిన ప్రణాళిక ప్రకారం.. మల్లన్నసాగర్ నుంచి 15 టీఎంసీల నీటిని పంపింగ్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో హైదరాబాద్‌కు 10 టీఎంసీలు వాడుకోనుండగా.. జంట జలాశయాలకు 5 టీఎంసీలు మళ్లించాలని నిర్ణయించినట్టు సమాచారం.అయితే.. ఈ ప్రాజెక్టుకు కేబినెట్ కూడా ఆమోదం తెలపగా.. త్వరలోనే టెండర్లు




పిలవాలని హైదరాబాద్ వాటర్ బోర్డు అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే.. కొత్త ప్రాజెక్టు డిజైన్ వల్ల.. పంపింగ్ అవసరం తగ్గటమే కాకుండా.. మెయిన్‌టెనెన్స్, విద్యుత్ ఖర్చులు కూడా గణనీయంగా తగ్గనున్నాయి. నీటిని ఆరుసార్లు ఎత్తివేయాల్సిన అవసరం కాకుండా.. కొత్త అలైన్‌మెంట్ దీనిని కేవలం రెండు పంప్ పాయింట్‌లకు తగ్గించి, ఉస్మాన్ సాగర్‌కు చేరుకోవడానికి దాదాపు 162 కిలోమీటర్ల మేర విస్తరించింది.సవరించిన ప్రాజెక్ట్ డిజైన్ నీటి సరఫరా ఖర్చు కిలోలీటర్‌కు దాదాపు రూ.4కు తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు. ఇది హైదరాబాద్‌లో పెరుగుతున్న నీటి అవసరాలను తీర్చేందుకు ప్రస్తుతం ఖర్చు చేస్తున్న రూ. 48 నుంచి భారీగా తగ్గించినట్టవుతుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది.

# యాదాద్రికి పూర్వ నిబంధనలు

**నల్గొండ :** అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా? అద్భుతమైన ఆలయంగా రూపుదిద్దుకున్న మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహఆస్వామి దేవస్థానానికి తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. ఇక నుంచి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని యాదాద్రి బదులుగా అన్ని రికార్డుల్లో యాదగిరిగుట్టగా వ్యవహారికంలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.. తెలంగాణ తిరుపతిగా పేరుందిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి టీటీడీ తరహాలో ప్రత్యేక ఆలయ మండలిని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. టెంపుల్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు ఆదేశించారు. టీటీడీ స్థాయిలో బోర్డుకు ప్రాధాన్యత ఉండేలా పూర్తి అధ్యయనంతో యాదగిరిగుట్ట




టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు.యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణను పూర్తి చేయాలని రేవంత్ అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధికి కావాల్సిన ప్రపోజల్స్ వారం రోజుల్లో పంపించాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఇక నుంచి యాదాద్రి బదులుగా అన్ని రికార్డుల్లో యాదగిరిగుట్టగా వ్యవహారికంలోకి తీసుకురావాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. యాదగిరిగుట్ట పై భక్తులను నిదుర చేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరారు.అంతేకాదు యాదగిరి గుట్ట పాలనా వ్యవహారాలను చూసుకునేందుకు ప్రత్యేక పాలకమండలి ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. టిటిడి తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానానికి పాలకమండలి ఏర్పాటు చేయడంతో పాటు యాదాద్రిని ఇక నుంచి యాదగిరిగుట్టగా అన్ని రికార్డుల్లో నమోదు చేయాలని సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇక, ఆలయం అభివృద్ధితో పాటు భక్తుల సౌకర్యార్థం పలు నిర్ణయాలు తీసుకున్నారు సీఎం. పాత ఆచార, సంప్రదాయాలను మళ్లీ అమలు చేయాలని సూచించారు. ఇప్పటికే యాదాద్రిని యాదగిరిగుట్టగా పిలవాలన్న రేవంత్ సర్కార్? ఆలయంలో మరిన్ని మార్పుల చేర్పులు చేసేందుకు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే భక్తులకు డ్రెస్ కోడ్‌ను తప్పనిసరి చేసింది. ఆలయ ఈవోతో పాటు సిబ్బంది కూడా డ్రెస్ కోడ్‌ను పాటిస్తున్నారు. స్వామి సన్నిధిలో భక్తులు బస చేసే విధంగా డార్మెంటరీ హాల్‌ను ఏర్పాటు చేశారు. అలాగే కొబ్బరి కాయలు కొట్టడం, కొండపైకి ఆటోలు వెళ్లడం వంటి పలు నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నారు. అంతేకాదు స్వామివారి క్షేత్రాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు? ఇటీవలే ప్లాస్టిక్ వాడకాన్ని కూడా నిషేధించారు. అలాగే ఏళ్లుగా వస్తున్న గిరిప్రదక్షిణ సంప్రదాయాన్ని మళ్లీ అందుబాటులోకి తెచ్చారు. ఇక తాజాగా ఆలయ సన్నిధిలోని విష్ణు పుష్కరిణిలో సంకల్ప స్నానానికి అనుమతించారు. మొత్తానికి ప్రభుత్వాలు మారడంతో? యాదగిరిగుట్టపై ఆచారాలు, సాంప్రదాయాలు, భక్తుల సౌకర్యాల కల్పనలోనూ మార్పులొస్తున్నాయి. ఇక కొండపై పాత ఆచార సాంప్రదాయాలను పునరుద్ధరించడం పట్ల భక్తులు సంతోషంగా వ్యక్తం చేస్తున్నారు.

# కలెక్టర్లు ఎనుమరెటర్ లతో విస్తృతంగా మాట్లాడాలి

## -మంత్రులు, ఎమ్మెల్యేల కు సమాచారం ఇవ్వండి

## -దేశం మొత్తం తెలంగాణను గమనిస్తుంది

## -సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హౌస్ లిస్టింగ్ పూర్తిచేసుకుని నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో కలెక్టర్లు ఏనుమరెటర్లతో విస్తృతంగా మాట్లాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడారు. నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి అనేక సందేహాలు వ్యక్తమవుతుంటాయి, కలెక్టర్లు ఎనుమరెటర్ ల తో ఎప్పటికప్పుడు మాట్లాడితే ప్రజల సందేహాలు ఏంటో వెను వెంటనే తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల సందేహాలను కలెక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి ప్రజల అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువ సార్లు సర్వేలో భాగస్వాములు అయ్యేలా చూడాలని అధికారులను కోరారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా పెద్ద కార్యక్రమం, ఇలాంటి కార్యక్రమాన్ని ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళుతున్న అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. క్వశ్చనీర్ పకడ్బందీగా రూపొందించారు, ఎనిమరేటర్లకు బాగా శిక్షణ ఇచ్చారు, హౌస్ లిస్ట్ కూడా విజయవంతంగా పూర్తి చేశారు. ఇదే రీతిలో కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ దేశంలో జరిగే అతిపెద్ద కార్యక్రమం ఇది.. మనం చూపే నిబద్ధతపైనే ఈ సర్వే విజయవంతం అవడం ఆధారపడి ఉంటుంది అన్నారు. యావత్ దేశం మొత్తం తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న కుటుంబ సర్వేను గమనిస్తుందని వివరించారు. ఈ దేశంలో ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను వ్యాప్తి చేయడానికి ఈ సర్వే గొప్పగా ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ప్రతి చిన్న విషయం కూడా నిర్లక్ష్యం చేయకుండా ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్న అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. సర్వేపై కలెక్టర్లతో పాటు అన్ని స్థాయిలోని అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రధానంగా పట్టణాలపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ శాంత కుమారి, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తాన్య యితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సుల్లో రెట్టింపైన మహిళా ప్రయాణికులు

**హైదరాబాద్ :** తెలంగాణ ఆడబిడ్డల ఆకాంక్షలను నెరవేర్చాలనే మంచి ఉద్దేశంతోనే 'మహాలక్ష్మీ' పథకాన్ని ప్రకటించామని సీఎం రేవంత్ వెల్లడించారు. ప్రస్తుతం ఆడపిల్లలు, మహిళలు ఫ్రీ బస్సు సౌకర్యాన్ని చక్కగా వినియోగించుకుంటున్నా?రని అన్నారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న ఆడి పిల్లలపై ఓ నెటిజన్ ట్వీట్ చేశారు. 'నమస్కారం రేవంత్ రెడ్డి సార్.. ఈ పిల్లలు మహాలక్ష్మి పథకాన్ని ఉపయోగించుకుని గ్రౌండ్‌కు వెళ్లి చక్కగా గేమ్స్ నేర్చుకుంటున్నారు. మహాలక్ష్మి పథకం ఆడపిల్లలు



చాలా ధైర్యంగా ముందుకు వెళ్లటానికి ఉపయోగపడుతుంది సార్. మీకు ధన్యవాదాలు సార్.' అని ట్వీట్ చేసారు.ఈ ట్వీట్‌కు సీఎం రేవంత్ రిప్లయ్ ఇచ్చారు. ఈ మహాలక్ష్ములను చూస్తుంటే తమ ప్రభుత్వ ఉద్దేశం నెరవేరుతోందని అర్థమవుతోందన్నారు. చాలా సంతోషంగా ఉందని.. వీరు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు రేవంత్ ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేశారు. 'ఆడబిడ్డల ఆకాంక్షలను నెరవేర్చాలన్న సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ "మహాలక్ష్మీ" పథకాన్ని ప్రకటించింది. ఈ మహాలక్ష్ములను చూస్తుంటే.. ఆ పథకం ఉద్దేశం నెరవేరుతోందన్న విషయం అర్థమవుతోంది. చాలా సంతోషం. ఆ పిల్లలు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని, వారి లక్ష్యాలను చేరాలని ఆకాంక్షిస్తున్నాను.' అని రేవంత్ ట్వీట్ చేశారు.కాగా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ఫ్రీ బస్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ ఉచిత బస్సు పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు రాష్ట్రంలో ఎక్కిడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చు. సిటీ ఆర్డినరీ, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సులో ఏదైనా తెలంగాణ గుర్తింపు కార్డు కండక్టర్‌కు చూపించి జీరో టికెట్ ద్వారా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించారు.రేవంతన్న మాకు మంచిగ చేసిండు.. జై కొడుతున్న మహిళలుఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. గతంలో రోజుకు 30 లక్షల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తే.. ఇప్పుడు ఆ సంఖ్య దాదాపు 60 లక్షలకు చేరుకుంది. చాలా మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. దీంతో ఆర్టీసీకి ఆదాయంతో పాటుగా మహిళలకు టికెట్ డబ్బులు మిగులుతున్నాయి

# పీకల్లోతు కష్టాల్లో పత్తిరైతులు

**వరంగల్ :** ఎన్నో కష్టాలకోర్చి పత్తి పంట పండిస్తే మార్కెట్‌కు వచ్చిన అన్నదా త వ్యాపారుల చేతిలో వంచనకు గురవుతున్నా డు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసి ఐ) అధికారులు వ్యాపారులతో మిలాఖత్ కావడంతో పత్తి రైతులకు కష్టాలు తప్పడం లేదు. వ రంగల్ జిల్లాలో పత్తి తీయడం జోరందుకున్న ది. సెప్టెంబర్ నుంచే ప్రారంభం కావడంతో ఇ ప్పటికే ఒక దఫా పత్తి పూర్తి కాగా, రెండోసారి కూడా పత్తి ఏరుతున్నారు. అయితే పత్తి రైతు సీ జన్ ఆరంభం నుంచి మోసపోతూనే ఉన్నాడు. రైతులకు తేమ, లూజు పేరుతో సిసిఐ, వ్యాపారులు రైతులకు పంగనామం పెడుతున్నారు. సి సిఐ కేంద్రాల్లో కొనకపోవడంతో దళారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు తయారైంది. జిన్నింగ్ మిల్లుల యజమానులు, దళారులు కుమ్మక్కై దందా చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయిఅంతర్జాతీయ మార్కెట్‌లో బే ళ్లు,గింజలకు ధర తగ్గిపోయిందంటూసాకులు చెబుతూ ధర తగ్గిస్తున్నారు. ప్రభుత్వం పత్తికి మద్దతు క్వింటాకు రూ.7,521ప్రకటించింది. పత్తి రైతుకు మద్దతు ధర కల్పించడంలో మార్కెటింగ్ శాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. వ్యాపారులు సిండికేటుగా మారి రైతులను ని లువునా దోచుకుంటున్నారు. రైతుల నుంచి మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాల్సిన సిసిఐ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే అరోపణలు వినవస్తున్నాయి.లాభం దేవుడెరుగు.. పత్తి రైతలకు పెట్టుబడి కూడా రావడం లేదు. ఇటీవల భారీ వర్షా లు కురవడంతో వరంగల్ జిల్లా వ్యాప్తంగా పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నాయి. వరంగల్ జిల్లాలో 1,18,700 ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. వర్షాలకు పత్తి జాలుపట్టి పూత, కాత రాలిపోయింది. తెగుళ్లబారిన పడడంతో సుమారు 50 శాతం పంట దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో మొక్కదశలో ఎండిపోయింది. తర్వాత కాస్త వర్షాలు కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నా రు.ఇప్పుడు భారీ వర్షాలు కురవడంతో



పూత, కాత దశలో ఉన్న పత్తిని కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడుగా వంటలో కలుపును ఏరివేసేందుకు మందుల పిచికారీతో పాటు కూలీల ఖర్చులు అధికంగా పెరిగాయి. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాని పరిస్థితి ఉందని రైతులు దిగాలు చెందుతున్నారు. మూడు కాతలు వరకు పంట దిగుబడి రావాల్సి ఉండగా కేవలం ఒకే కాతకు పంట పరిమితమైంది. ఎకరాకు సుమారు 15 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి రావాల్సి ఉండగా కనీసం 5 క్విం టాళ్లు కూడా దిగుబడి వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు.

# భద్రకాళి చెరువుకు గండి




**వరంగల్:** వరంగల్ భద్రకాళి చెరువుకు అధికారులు గండి కొట్టారు. కాకతీయుల కాలం నాటి రాతి కట్టడం మత్తడి బండ్‌కు గండి పెట్టారు. చెరువులో పూడికతీత పనులు మొదలుపెట్టారు. మట్టి పూడికతీత, గుర్రపు డెక్కను తొలగించనున్నారు. 382 ఎకరాల విస్తీర్ణంలో భద్రకాళి చెరువు నుంచి.. 15 రోజులపాటు నీటిని దిగువ విడుదల చేయనున్నారు. రోజుకు 500 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. దిగువన కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టారు. ఇది స్వాగతించే విషయమే అయినా.. ఎన్నో ప్రశ్నలు, సందేహాలు ఉన్నాయి.

1. చెరువులో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాల సంగతేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వేసవిలో ఇళ్లలోని బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం పొంచి ఉందని ఇంజినీర్లు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

2. భద్రకాళి చెరువు ఖాళీ చేస్తే మళ్లీ నింపడానికి ఉన్న ఒక్క మార్గం కాకతీయ కాలువ. అయిదేళ్ల కిందట వరంగల్ ఆటోనగర్ కాకతీయ కెనాల్ ఆఫ్‌టేక్ సంపును నీటిపారుదల శాఖ ఇంజినీర్లు తొలగించారు. కొత్తగా సంపు కడితేనే చెరువులోకి మళ్లీ నీటిని తీసుకొచ్చే వీలు ఉ ంటుంది. 3. భద్రకాళి చెరువు ప్రక్షాళన, శుద్ధీకరణ సంగతి ఎలా ఉ న్నా.. కాలనీల్లో భూగర్భ జలాల సంగతి కూడా ఆలోచించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 4. వరంగల్– హనుమకొండ– కాజీపేట త్రి నగరాల మధ్య భద్రకాళి చెరువు ఉంది. 15 ఏళ్లుగా వర్షాకాలంలో వరద నీరు పోటెత్తడంతో చెరువు నిండుతోంది. ఈ ఏడాది కూడా భారీగా వరదలొచ్చాయి. ప్రస్తుతం భద్రకాళి చెరువులో 140– 150 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీరు ఉంది. 5. భద్రకాళి చెరువు నీటి నిల్వతో చుట్టుపక్కల సుమారు 100 కాలనీల్లో భూగర్భ జలాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. సుమారు 5 కిలో మీటర్ల పరిధి వరకు కాలనీల్లోని బోర్లు, బావుల్లో నీళ్లు ఉంటాయి. ప్రస్తుతం చెరువులోని నీటిని ఖాళీ చేస్తే వేసవిలో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది. 5. దాదాపు పదిహేను ఏళ్ల కిందటి వరకు వేసవిలో వరంగల్ నగరప్రజల తాగునీటి అవసరాల కోసం ఆటోనగర్ కెనాల్ ఆఫ్‌టేక్ పాయింట్ నుంచి కాకతీయ కాలువ నీళ్లను భద్రకాళి చెరువులోకి పంపింగ్ చేసేవారు. 6. భద్రకాళి చెరువు నీటిని కాపువాడ మత్తడి నుంచి అలంకార్ పెద్దమోరీ, కాకతీయ కాలనీ, పెద్దమ్మగడ్డ మీదుగా నాగారం చెరువులోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. 15 నుంచి 20 రోజుల్లో చెరువు ఖాళీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. 7. భద్రకాళి చెరువు నీటిని సాఫీగా విడుదల చేసేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి. ప్రావిణ్య వివరించారు. నాగారం చెరువు నిండిన తరువాత ఇప్పటి మాదిరే మత్తడి నుంచి కింది ప్రాంతానికి వాగు ద్వారా వెళ్లేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. 8. భద్రకాళి చెరువు ఖాళీ చేయడం వల్ల సమీప ప్రాంతాల్లో భూగర్భ నీటిమట్టం తగ్గే అవకాశాలున్నాయని విశ్రాంత ఇంజనీర్లు చెబుతున్నారు. అయితే.. ఈ ఒక్క సీజన్‌లో ఇబ్బందులుంటాయని.. పనులు పూర్తయితే.. మరో 50 ఏళ్ల వరకు ఇబ్బందులు ఉండవని అంటున్నారు.

# మెగా కృష్ణారెడ్డి చుట్టూ రాజకీయం...

**హైదరాబాద్ :** మేఘా కృష్ణారెడ్డి అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు ఉండరు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని బడా బడా కాంట్రాక్టులు ఆయన కంపెనీలే చేస్తూంటాయి. తెలంగాణలో కాళేశ్వరం అయినా.. ఏపీలో పోలవరం అయినా మేఘా ఇంజినీరింగే కాంట్రాక్టర్. ఇవి అతి భారీ ప్రాజెక్టులు. కింది స్థాయి వరకూ కొన్ని వేల కాంట్రాక్టులు ఆయన సంస్థకు దక్కి ఉంటాయి. ఇలా తెలుగు రాష్ట్రాల ఆర్టీసీల్లో తిరిగే ఎలక్ట్రిక్ బస్సులు అన్నీ ఒలెక్ట్రాకు చెందినవి. ఇది మేఘా గ్రూప్ కంపెనీనే. ఇంకా అనేక విభాగాలు ఉన్నాయి. కానీ ఆయన ఎప్పుడూ రాజకీయాల్లో జోక్యం చేసుకోలేదు. కానీ ఎవరు అధికారంలో ఉంటే వారికి ప్రతీపాత్రుడు. తెలంగాణలో బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉంది. మేఘా ఇంజినీరింగ్ కంపెనీ ఎన్నో కాంట్రాక్టులు చేపట్టింది. ఇంకా చెప్పాలంటే ప్రాజెక్టుల రీ డిజైనింగ్ పనులన్నీ మేఘా కంపెనీకే దక్కాయి. కాళేశ్వరం లక్ష కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టు. ఇందులో సింహ భాగం మేఘా కంపెనీనే చేసింది. ఇతర ప్రాజెక్టులు కూడా ఆ సంస్థకే దక్కాయి. బాగా పని చేస్తున్నారని ఓ సారి కేసీఆర్ సన్మానం కూడా చేశారు. అందుకే విపక్ష నేతలు చాలా సార్లు మేఘా కంపెనీకి తెలంగాణను దోచి పెడుతున్నారని ఆంధ్రా కాంట్రాక్టర్ కు దాసోహం అయ్యారని ఆరోపించేవారు. మేఘాను ఈస్టిండియా కంపెనీగా పేర్కొనేవారు. మేఘా కంపెనీ బీఆర్ఎస్‌కు పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చింది. ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలతో వెలుగులోకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్లలో మేఘాతో పాటు అనుబంధ కంపెనీలు అత్యధికంగా విరాళాలు ఇచ్చిన పార్టీల్లో రెండో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో బీజేపీ ఉంది. బీజేపీ విషయం పక్కన పెడితే.. ఓ ప్రాంతీయ పార్టీకి.. భారీగా కాంట్రాక్టులు దక్కించుకున్న కంపెనీ రూ. రెండు వందల కోట్ల వరకూ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఇవ్వడం విమర్శలకు దారితీసేదే. అది బీఆర్ఎస్ పార్టీతో మేఘా ఇంజినీరింగ్ యజమానులకు ఉన్న సాన్నిహిత్యం అనుకోవచ్చు. తామం అధికారంలో



ఉన్నప్పుడు తమకు అత్యంత సన్నిహితంగా వ్యవహరించిన కంపెనీపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. దీనికి కారణం ఏమిటో స్పష్టంగా తెలియదు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్ లో చేపడుతున్న ఓ ప్రాజెక్టును మేఘా, రాఘవ సంస్థలు కలిసి చేజిక్కించుకున్నాయి. ఈ రాఘవ సంస్థ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిది. తర్వాత హైదరాబాద్‌కు నీరందరించేలా చేపడుతున్న గోదావరి ఫేజ్ టు, మూసి ప్రాజెక్టులపై ఇంకా టెండర్లు ఖరారు కాలేదు. అసలు టెండర్లే పిలవలేదు. అయినప్పటికీ ఆ సంస్థకే టెండర్లు ఇస్తారని తాము వచ్చాక సంతకాలు చేసిన అధికారుల్ని జైలుకు పంపుతామని కేటీఆర్ హెచ్చరిస్తున్నారు. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉంది కాబట్టి మేఘా కృష్ణారెడ్డి కూడా ఆ పార్టీతో సన్నిహితంగా ఉ ంటున్నారు. ఒక వేళ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆయన హవా కొనసాగేది. బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేసేవారు కాదు. మొత్తంగా చూస్తే మేఘా కృష్ణారెడ్డి ఎవరు అధికారంలో ఉంటే వారికి సన్నిహితమయ్యే ట్రిక్స్ అన్ని బాగా వంటబట్టించుకున్నారన్న సెటైర్లు రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నాయి.

# లండన్ తర్వాత ముంబైలోనే ట్రాఫిక్

**ముంబై :** కాలం మారుతున్న కొద్దీ పట్టణాలు, నగరాల జనాభా పెరిగిపోతుంది. విద్య, ఉద్యోగం, వ్యాపారంతో పాటు ఇతర అవసరాకలు ఎక్కువ శాతం మంది గ్రామాల నుంచి పట్టణాలకు వస్తుంటారు. కొందరు ఇక్కడే నివాసం ఏర్పరుచుకోవడంతో ఇక్కడి జనాభా పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో రోడ్డు పై ప్రయాణించాలంటే ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా గ్రేటర్ నగరాల్లో ఉదయం, సాయంత్రం కార్యాలయాకు వెళ్లాలంటే నరకంగా మారుతుంది. రోజురోజుకు వాహనాల సంఖ్య పెరగడంతో రోడ్లన్నీ ఖాళీ లేకుండా కనిపిస్తాయి. ఈ నేప్యంలో టామ్ టామ్ అనే సంస్థ ట్రాఫిక్ ఎక్కుగా ఉన్న నగరాలు ఏవో గుర్తించింది. ఈ సంస్థ చెప్పిన ప్రకారం ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నగరాలు ఏవో తెలుసుకుందాం..ప్రపంచ వ్యాప్తంగా పట్టణాలు, నగరాలు అభివృద్ధి దిశలో పయనించినప్పుడు ట్రాఫిక్ కూడా పెరుగుతంది. వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు సిటీలోకి వస్తుంటారు. కొందరు ఇక్కడే నివాసం ఉండడంతో జనాభా పెరిగిపోయి ట్రాఫిక్ పెరిగిపోతుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఈ పరిస్థితిని గమనించి టామ్ టామ్ అత్యంత ట్రాఫిక్ రద్దీగా ఉండే నగరాలు ఏవో తెలిపింది. ఈ సంస్థ ప్రకారం ప్రపంచంలోనే అత్యంత ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నగరంగా లండన్ గా గుర్తించారు. ఇక్కడ అత్యంత ఎక్కువ సమయంల ట్రాఫిక్ లోనే గడపాల్సి వస్తుంది. ఇక్కడ 10 కిలోమీటర్లు ప్రయాణించాలంటే 37 నిమిషాల 10 సెకండ్స్ సమయం పడుతుంది. అయితే భారత్ లో ఏ నగరాల్లో ఎంత ట్రాఫిక్ ఉ ందంటే? భారతదేశంలో అత్యంత ట్రాఫిక్ ఎక్కువగా ఉండే నగరాల్లో ముంబయ్ ఒకటి. భారతదేశ ఆర్థిక నగరంగా పిలవబడే ముంబయ్ కు రాకపోకలు సాగించేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. దీంతో ఇక్కడ ట్రాఫిక్ ఏర్పడుతుంది. ముంబయ్ లో 10 కిలోమీటర్లు ప్రయాణించాలంటే 21 మినిట్స్ 20 సెకెండ్స్ సమయం పడుతుంది. దీంతో అత్యంత ట్రాఫిక్ రద్దీగా ఉండే నగరాల్లో లండన్ 4వ స్థానంలో నిలిచింది. దేశంలో ముంబయ్ తరువాత అత్యంత ఎక్కువగా ట్రాఫిక్ ఉండే నగరం న్యూ ఢిల్లీగా పేరు తెచ్చుకుంది. దేశ రాజధాని అయిన



న్యూఢిల్లీలలో కార్యాలయాలకు సంబంధించిన పనులు ఎక్కువగా ఉ ంటాయి. అందువల్ల ఉదయం ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుంది. ఈ క్రమంలో న్యూఢిల్లీలో 10 కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటే 21 నిమిషాల 40 సెకండ్స్ పడుతుంది. దీంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నగరాల్లో న్యూఢిల్లీ మూడో స్థానంలో నిలిచింది. ట్రాఫిక్ ఎక్కువగా ఉ న్న నగరాల్లో మహారాష్ట్రంలోని పూణె ఉంది. పారిశ్రామిక నగరంగా గుర్తింపు ఉన్న ఇక్కడ రోజురోజుకు జనాభా పెరిగిపోతుంది. ఈ క్రమంలో ట్రాఫిక్ కూడా విపరీతంగా మారుతంది. దీంతో పూణె నగరంలో ప్రయాణం చేయడం కష్టతంగా మారుతుంది. ఇక్కడ 10 కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటే 27 నిమిషాల 50 సెకండ్స్ సమయం పడుతుంది. ఇక అత్యంత ఎక్కువగా ట్రాఫిక్ ఉన్న నగరంగా బెంగుళూరు నిలిచింది. ఇది దేశంలో నెంబర్ వన్ స్థానంలో.. ప్రపంచంలో 4వ స్థానంలో నిలిచించి. కార్పొరేట్ నగరంగా పేరున్న బెంగుళూరులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో ఇక్కడ 10 కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటే 28 నిమిషాల 10 సెకండ్స్ సమయం పడుతుంది


# కురుమూర్తి ఉత్సవాలకు రూ.110 కోట్లు



మహబూబ్ నగర్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి దేవాలయ అభివృద్ధిపై రేవంత్ రెడ్డి సర్కార్ దృష్టి సారించింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తిలో కొలువైన వేంకటేశ్వరుడు.. కురుమూర్తి రాయుడిగా పూజలందుకుంటున్నారు. అయితే.. ఏడుకొండల మధ్యలో ఉన్న కాంచనగుహలో కొలువుదీరిన కురుమూర్తి ఆలయానికి చేరుకునేందుకు సరైన రోడ్డు లేకపోవటంతో.. భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో.. కురుమూర్తి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు..రూ. 110 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఆలయానికి ఘాటు రోడ్డు నిర్మాణ ఆవశ్యకతపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తీసుకెళ్లారు. తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే జాతరలలో కురుమూర్తి జాతర కూడా ఒకటి. ప్రస్తుతం కురుమూర్తి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న వేళ.. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు పడుతుండటం గమనించిన ప్రభుత్వం.. ఘాట్ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను గుర్తించింది. ఈ మేరకు.. ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసింది. 34 లక్షల రూపాయల వ్యయంతో శాశ్వత తాగునీటి సౌకర్యాలను కల్పించడంతో పాటు ప్రస్తుతం రూ.11 0 కోట్లతో ఘాటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయటంపై.. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతుండడంతో భక్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీపావళి సందర్భంగా.. అక్టోబర్ 31న కురుమూర్తి బ్రహ్మోత్సవాలు మొదలుకాగా.. నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు కేవలం మహబూబ్‌నగర్ జిల్లా నుంచే కాకుండా తెలంగాణ నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు రానున్నారు. సుమారు 4 లక్షల మంది భక్తులు ఈ బ్రహ్మోత్సవాలల్లో పాల్గొననున్నట్టు అంచనా వేశారు.

# పెళ్లిళ్లు... ఆలస్యమే ప్రధాన సమస్య

నిరుద్యోగం.. పడిపోతున్న రూపాయి.. ధరల పెరుగుదల.. ప్రమాదకరంగా ఆర్థిక పరిస్థితి.. అసలు ఇవేవీ సమస్యలు కావు. యువకులకు సరైన సమయంలో పెళ్లి కాకపోవడమే ఇప్పుడు అసలైన సమస్య. పెళ్లి కాని ప్రసాద్ లు పెరిగిపోతున్నారు.. ఇది ఇండియాలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఉంది. ఇందుకు తగ్గట్టుగానే ప్రతి దేశంలో జనాభా తగ్గుదల కనిపిస్తుంది. ముఖ్యంగా జపాన్ లో అయితే పెళ్లి, పిల్లలు, సంసారం అనే వాటికి దూరం అయ్యారు విలాసవంతమైన జీవితాన్ని కోరుకుంటున్నారు. పెద్ద ఫ్లాటూ కారూ అంటూ ఆదాయానికి మించి ఖర్చు చేసి చివరికి పరిస్థితి చేయి దాటిపోయాక ఒత్తిడికి లోనవుతుంటారు. ఆ ప్రభావమంతా భాగస్వామి మీద పడుతుంది. గొడవలు మొదలవుతాయి. చివరికి– నీవల్లే అంటే కాదు నీవల్లే అని ఆరోపించుకుంటూ సమస్యను తెగేదాకా లాగుతున్నారు. ఇద్దరూ ఉద్యోగం చేస్తుంటే ఇంటికి రాగానే అతడు టీవీ దగ్గర కూర్చుంటాడు. వచ్చీ రావడంతోనే మళ్లీ వంటింట్లోకి వెళ్లి పనిచేయడానికి ఆమె చికాకుపడుతుంది. మాటామాటా పెరుగుతుంది. మనసు విరిగిపోతుంది. బంధం పట్ల అసంతృప్తి పేరుకుపోతుంది. చాలాసార్లు తల్లిదండ్రుల జోక్యమూ పెద్ద సమస్యగా మారుతోంది. ఇద్దరికీ ఉద్యోగం ముఖ్యం. కెరీర్‌లో పైకెదగాలని ఆశపడుతూ ఆ క్రమంలో అనుబంధానికి ప్రాధాన్యమివ్వడం లేదు. చిన్న చిన్న అభిప్రాయభేదాలొచ్చినప్పుడు కూర్చుని మనసు విప్పి మాట్లాడుకునే పరిస్థితి ఉండటం లేదు. ఇప్పటి యువతరం అలవాట్లూ కొంతవరకు కుటుంబజీవనాన్ని ఇబ్బందిపెడుతున్నాయి. ఆలస్యంగా పడుకోవడం, ఆలస్యంగా లేవడం, పబ్బులూ క్లబ్బులూ, సిగరెట్టూ మద్యంలాంటివీ… గొడవలకు దారితీసి చినికి చినికి గాలివానని చేస్తున్నాయి. సంబంధాలు చూసుకునేటప్పుడు చదువూ హోదా అందచందాలు లాంటివి చూస్తున్నారు కానీ కంపాటిబిలిటీ గురించి ఆలోచించడం లేదు. యువత కూడా భాగస్వామిని ఎంచుకునేటప్పుడు ఆశయాలకు ప్రాధాన్యమివ్వాలో అభిరుచులకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకోలేకపోతున్నారు. లైంగిక సమస్యలూ ఈమధ్య విడాకులకు కారణమవుతున్నాయి. సమస్యని దాచి పెళ్లి చేసుకోవడంవల్ల తర్వాత అది విడాకులకు దారితీస్తోంది. ముఖ్యంగా జపాన్ దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లోని అబ్బాయిలను పెళ్లి చేసుకునేందుకు కొత్త స్కీం తీసుకొచ్చింది అక్కడి ప్రభుత్వం. ఈ స్కీం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జపాన్ దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లోని అబ్బాయిలను.. అమ్మాయిలు పెళ్లి చేసుకుంటే మన భారత కరెన్సీలో మూడున్నర లక్షల రూపాయలు ఇవ్వనున్నారు. జపాన్ దేశం కరెన్సీలో 6 లక్షల యెన్ లు.. ఈ డబ్బులు అమ్మాయిల బ్యాంక్ అకౌంట్ లో వేస్తారు. ఈ స్కీం తీసుకురావటానికి కారణం లేకపోలేదు. జపాన్ లో గ్రామీణ ప్రాంతాల్లో జనాభా సంఖ్య భారీ స్థాయిలో తగ్గిపోతుంది. అందరూ పట్టణాలు, నగరాలకు వలస వెళుతున్నారు. దీన్ని అరికట్టి.. గ్రామీణ ప్రాంతాల్లో జనాభా సంఖ్య పెంచటమే ఈ పథకం ఉద్దేశం. జపాన్ దేశంలోని ఏ ప్రాంతం అమ్మాయి అయినా సరే.. గ్రామీణ ప్రాంతంలోని అబ్బాయిని మ్యారేజ్ చేసుకుని.. అక్కడే నివాసం ఉండాలి. అక్కడే పిల్లలను



కనాలి అన్నమాట. దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య" ఇవీ మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో శరద్ పవర్ పార్టీకి చెందిన అభ్యర్థి రాజే సాహెబ్ దేశ్ ముఖ్ చేసిన వ్యాఖ్యలు. సహజంగా ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రజలకు వరాలు ఇస్తుంటాయి. అరచేతిలో స్వర్గాన్ని చూపిస్తుంటాయి. సంక్షేమ మంత్రాన్ని పటిస్తుంటాయి. ఉచితాల తాయిలాలను వేస్తుంటాయి. కానీ, ఇదంతా రొటీన్ అయిపోయింది. ఇలాంటి సమయంలో మన దేశం ఎదుర్కొంటున్న అసలైన సమస్యను శరద్ పవర్ పార్టీకి చెందిన అభ్యర్థి రాజే సాహెబ్ దేశ్ ముఖ్ తెరపైకి తెచ్చారు. ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థి పార్టీల మీద విమర్శలు చేయకుండా.. అసలైన సమస్యను ప్రస్తావించారు. "వయసు వచ్చిన యువకులకు పెళ్లి చేస్తానని.. జీవన ఉపాధిని కూడా కల్పిస్తానని" ఆయన ఎన్నికల ప్రచారంలో చెప్పడం దేశవ్యాప్తంగా చర్చకు కారణమవుతోంది. నిజానికి దేశంలో నిరుద్యోగం ఎక్కువగా ఉంది. ఆర్థిక అంతరం పెరిగిపోయింది. ఇంకా చెప్పాలంటే అనేక సమస్యలు ఉన్నాయి. కానీ వాటన్నింటికీ మించి ఈడు వచ్చిన యువకులకు పెళ్లిళ్లు కాకపోవడం అనేది అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం దక్షిణాది రాష్ట్రాలలోనే ఈ సమస్య లేదు. ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల్లో కూడా ఈ సమస్య ఉంది. కేవలం ఆదివాసి, ఆదిమ జాతులలోనే ఈ సమస్య లేదు..ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం గత 10 ఏళ్లలో పెళ్లికాని యువకుల సంఖ్య దేశంలో పెరుగుతున్నట్టు తెలుస్తోంది. ఒకప్పటిలాగా అమ్మాయిలు పెద్దల మాట విని.. వారు సూచించిన అబ్బాయిని చేసుకునే పరిస్థితి లేదని తెలుస్తోంది. "ఉద్యోగం, కెరియర్, ఆర్థిక స్థిరత్వం, దురలవాట్లు లేనివారిని అమ్మాయిలు కోరుకుంటున్నారు. అన్ని విషయాలలోనూ ఒక స్పష్టతతో వ్యవహరిస్తున్నారు. ఒకవేళ కట్టుకున్నవాడు పెత్తనం చేసినట్టు కనిపిస్తే.. మొహమాటం లేకుండా దాంపత్యానికి వీడ్కోలు పలుకుతున్నారు. అందువల్లే చాలామందికి పెళ్లిళ్లు కావడం లేదు. ఫలితంగా చాలామంది యువకులు ఒంటికాయ శొంఠి కొమ్ము జీవితానికి అలవాటు పడుతున్నారని" ఆ సంస్థ తన సర్వేలో ప్రకటించింది. భ్రూణ హత్యలు పెరిగిపోవడం.. ఆడపిల్లలను ఎక్కువగా కనకపోవడం.. చాలా రాష్ట్రాలలో లింగ సమానత్వం లేకపోవడం కూడా ఈ సమస్యకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ పథకంపై ప్రతిపక్షాలకు విమర్శలకు దిగాయి. మహిళల స్వేచ్ఛకు. సమానత్వానికి ఇది భంగం అంటూ నిరసనలకు దిగారు. ఇక అమ్మాయిలు అయితే రచ్చ రచ్చ చేశారు.

# కవ్వాల్ ప్రాంతంలో పులి అలజడి



**అదిలాబాద్ :** అదిలాబాద్ జిల్లా కవ్వాల్ ప్రాంతంలో పెద్ద పులి అలజడి సృష్టిస్తోంది. జిల్లాలోని భీంపూర్, తాంసి, తలమడుగు మీదుగా బోథ్ మండలానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. అక్కడి నుంచి నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలం అడెల్లి తండా నుంచి మహారాష్ట్రలోని అప్పా రావుపేట్ మీదుగా కుంటాల మండలంలోని సూర్యాపూర్, మెదన్పూర్ బుడుబుడు జలప్రాంతంలో సంచరిస్తూ పశు వులపై దాడికి పాల్పడిన పెద్దపులి తాజాగా మంగళవారం సరిహద్దుల్లోనే సంచరించడం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. సూర్యాపూర్ అటవీ ప్రాంతంలో పశువులపై దాడి చేయడంతో అధికారులు ట్రాఫ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు పలుమార్లు ఆవు కళేబరాన్ని తినేందుకు వచ్చిన పులి కెమెరాకు చిక్కినట్లు అధికారులు నిర్ధారించారు. గత ఆదివారం సూర్యాపూర్ గ్రామస్తులు మేత కోసం తీసుకెళ్లగా చెరువులో నీళ్లు తాగేందుకు వచ్చిన పెద్దపులి కనిపించడంతో పశువులు బెదిరి నీటిలోకి వెళ్లాయి. పశువుల కాపరులు కుంటి రాములు, దొంతుల చిన్నయ్య చెట్టెక్కి ప్రాణాలు దక్కించుకున్నారు. మండలంలోని అంబుగామ అటవీ ప్రాంతం పీర్ల గుట్టలో ఆవుపై దాడిచేసి గాయపరిచింది. కాగా మంగళ వారం తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లోనే పులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో సంచరిస్తున్న పెద్దపులి మహారాష్ట్ర సరిహద్దు దాటేవరకు రక్షణ చర్యలు చేపడుతు న్నట్లు డీఎఫ్?వ నాగిని భాను పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంబుగామ అటవీ ప్రాం తంలో సిబ్బందితో కలిసి పులి రక్షణ చర్యలు పరిశీలించారు. పులి పాద ముద్రలు గుర్తించినట్లు ఆమె వెల్లడించారు. పెద్దపులి సంచారం కొనసాగుతున్న నేపత్యంలో పశువుల కాపారులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతు లు, కూలీలు ఉ దయం 9 గంటల వెళ్లి 4 గంటల లోపు పనులు ముగించుకోవాలని సూచించారు. కర్రకు గజ్జెలు కట్టి శబ్దం, అరుపులు చేస్తూ వెళ్లాలని కోరారు. అటవీ ప్రాంతానికి అరకిలోమీటర్ మించి వెళ్లరాదని, పంటల రక్షణకు కంచెలు ఏర్పాటు చేయవద్దని కోరారు. పులి సరిహద్దు దాటే వరకు పశువులను మేత కోసం అడవిలోకి తీసుకెళ్లద్దని సూచించారు. పెద్దపులి దాడిలో మూడు ఆవులపై దాడి చేసిన ఘటన మంచిర్యాల పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ముత్యంపల్లి సెక్షన్ మామిడిగూడలోని గోండుగూడ ప్రాంతంలోని గిరిజన రైతుకి చెందిన ఆవుల మందపై దాడి చేసి మూడు ఆవులపై దాడి చేసినట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. ఇక్కడ సంచరిస్తున్నది ఎస్ 12 మగ పులిగా భావిస్తున్నట్లు తెలి పారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీ అడవుల నుంచి కవ్వాల్ టైగర్ జోన్లోని ఖానాపూర్, పెంబి, హాజీపూర్ అటవీ ప్రాంతానికి వచ్చినట్లు పేర్కొన్నారు. సమీప గ్రామాల ప్రజలు, పశువుల కాపర్లు అడవిలోకి వెళ్లవద్దనిఅటవీ అధికారులు సూచించారు. ఇదిలా ఉంటే సారంగాపూర్ డిప్యూటీ రేంజ్ అధికారి నజీర్ ఖాన్ మాట్లాడుతూ పులి సంచార విషయం నిజమే అని ధ్రువీకరించారు. పశువులు మేత కు మైదాన ప్రాంతం లోనే మేత కు తీసుకెళ్లాలని తెలిపారు. కొన్ని రోజుల్లో పులి ప్రాంతం వదిలి వెళ్తుంది అని అన్నారు. ప్రజల ప్రాణాలు ముఖ్యమని జాగ్రత్త వహించాలని కోరారు

Edited, Printed, Published and Owned by **Ramancharla Srikanth** & Printed at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 &
Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **Title Code: TELTEL 02105**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: rcsrikanth143@gmail.com